క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నాయుడుపేటకు చెందిన పెనగలూరు లీలావతి పేరు మీద కుటుంబ సభ్యులు సుబ్బరామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, విష్ణు మాధవ్ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈఓ బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యువశ్రీ మురళికి సత్కారం



అన్నమయ్య పురస్కారం అందుకుంటున్న యువశ్రీమురళి

బుచ్చినాయుడుకండ్రిగ : తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లోని సమావేశ మందిరంలో పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులపై జాతీయ కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్యపై స్వీయ కవితలు, తెలుగు భాషా సాహిత్యం కోసం కృషి చేసిన వారికి అన్నమయ్య జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరై అన్నమయ్య కవితను వినిపించిన కలివెట్టు పాఠశాల ఉపాధ్యాయుడు యువశ్రీ మురళిని నిర్వాహకులు మల్రిపూడి దేవేంద్రరావు, పాలకూరు కన్నయ్య, నారాయణస్వామి, పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు కృష్ణవేణి, విజయలక్ష్మి శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించి, అన్నమయ్య పురస్కారాన్ని అందజేశారు.

ఓటు నమోదు దరఖాస్తుల పరిశీలన



కనమనంబేడులో దరఖాస్తులను స్వీకరిస్తున్న బీఎల్ఓ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా 11 మంది యువకులు ఓటు నమోదు చేసుకున్నట్లు తహసీల్దారు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలో రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో ఓటు నమోదుకు ఫారం-6, తొలగింపునకు ఫారం-7, సవరణ లేదా దిద్దుబాటుకు ఫారం-8కు సంబంధించిన 30 దరఖాస్తులను స్వీకరించటం జరిగిందన్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరిస్తామని తెలిపారు.

నేరపూరిత మనస్తత్వం వీడాలి



ఏర్పేడు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయచంద్ర

రేణిగుంట : సమాజంలో తోటి పౌరుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని ఏర్పేడు సీఐ జయచంద్ర పేర్కొన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ఆదివారం ఏర్పేడు మండల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరపూరిత మనస్తత్వాన్ని విడనాడి మంచి మార్గాన నడవాలని సూచించారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం

తిరుపతి కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాజ మండపంలో కార్తీక వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత శివకేశవలకు పూజ అభిషేకం చేపట్టారు. అలాగే తులసి దామోదర పూజ, తులసి, ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం అనంతరం కార్తీక మహోత్సవం విశేషాలపై డాక్టర్ తనూజ విష్ణువర్ధన్ ప్రవచనాలు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్కృత వర్సిటీ కులపతి రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ కార్తీక మాసం హిందువులకు పవిత్రమైందని, కార్తీక వన సమారాధన వంటి కార్యక్రమాలు సమాజాన్ని ఒకటి చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజం డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో జరుగనున్న వేద విద్వత్ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

వసతి కష్టాలు..

అవస్థలే పాఠాలు

నారాయణవనం హాస్టల్‌లో మరుగుదొడ్లు ఇలా..



కుటుంబ ఆర్థిక పరిస్థితులతో తల్లిదండ్రులకు దూరంగా చదువుకుంటున్న విద్యార్థులు వసతులు లేని సంక్షేమ హాస్టళ్లలో అవస్థలు పడుతున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ , నారాయణవనం, పాలమంగళంలలో వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాస్టళ్లను సందర్శించి, సౌకర్యాల కల్పనపై గుప్పించిన హామీలు నీటి మూటలయ్యాయి.

– నారాయణవనం, బుచ్చినాయుడు కండ్రిగ

- సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

మండలంలో పాలమంగళం గ్రామానికి దూరంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. పరిసరాలలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను తొలగించడంలో అశ్రద్ధ చూపడంతో భయపడుతున్నారు. దీంతో దోమలు, విష పురుగుల బెడద అధికమైందని విద్యార్థులు వాపోతున్నారు. దీనికి తోడు నిర్మాణం పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లు విష సర్పాలకు ఆవాసంగా మారాయి. దీంతో చీకటి పడితే విష పురుగులు, దోమలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కలుపు మొక్కలు, శిథిలమైన మరుగుదొడ్లను తొలగించాల్సిన అవసరం ఉంది.

తలుపులు లేని మరుగుదొడ్లు

65 మంది విద్యార్థులు తలదాచుకుంటున్న నారాయణవనంలోని ఎస్సీ వసతి గృహంలో మరుగుదొడ్డికి మరుగు లేకుండా పోతున్న పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పదికి పైగా ఉన్న మరుగుదొడ్ల ప్లాస్టిక్ తలుపులు విరిగిపోయాయి. దీంతో మరుగు లేకుండానే విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. మగ పిల్లలే కద ఎక్కడికి పోయినా ఏం పర్వాలేదు అనుకున్నారేమో.. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి చూసి పోతున్నారే గాని మరమ్మతులు మాత్రం చేపట్టలేదు.

స్పందించని అధికారులు

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా సంక్షేమ అధికారులు కలిసి మూడు మాసాల కిందట హాస్టళ్లను సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి రాత్రి భోజనాలు చేశారు. నారాయణవనం హాస్టల్ మరమ్మతులు చేపట్టేందుకు పనులకు అనుమతి లభించినా.. పనులు మాత్రం ప్రారంభం కాకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. వసతి గృహాలలో సౌకర్యాలను, భద్రతను కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షానికి ఉరుస్తున్న పైకప్పు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలో ఎస్సీ బాలుర, బాలికలు, బీసీ బాలుర హాస్టల్స్, కనమనంబేడులో ఏకలవ్య గురుకుల పాఠశాల సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని నిర్మించి 35 ఏళ్లు కావస్తుండటంతో మరమ్మతులకు గురైంది. దీంతో కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. దీంతో దోమలు విజృంభిస్తుండడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షం పడితే భవనం పైకప్పు ఉరుస్తోంది. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇక బీసీ బాలుర హాస్టల్‌లో 2016వ సంవత్సరంలో ప్రారంభమైనా మరుగుదొడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఎస్సీ బాలికల హాస్టల్.. పాఠశాల నుంచి కిలోమీటరు దూరంలో ఉంది. హాస్టల్ గ్రామానికి దూరంగా ఉండటంతో బాలికలకు భద్రత కరువైంది. ఏకలవ్య గురుకుల పాఠశాల హాస్టల్స్‌కు వాచ్‌మెన్ లేకపోవడంతో ఇంటర్ విద్యార్థినులు సరైన రక్షణ లేదని ఆందోళన చెందుతున్నారు.





బుచ్చినాయుడుకండ్రిగ : ఎస్సీ బాలుర హాస్టల్‌లో కిటికీలు ఇలా.., బీసీ బాలుర హాస్టల్‌లో అసంపూర్తిగా మరుగుదొడ్లు, పాలమంగళం హాస్టల్‌లో శిథిలమైన మరుగుదొడ్లు, పిచ్చి మొక్కలు

నిబంధనలు కొందరికేనా!



ఆక్రమణలో తొలగించని దుకాణాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని సన్నిధి వీధిలో తమ సొంత స్థలాల్లో దుకాణాలకు రేకులు ముందుకు వచ్చాయని, బోర్డులు పెట్టారని, మెట్లు ముందుకొచ్చాయని సమాచారం ఇవ్వకుండానే మూడు రోజుల కిందట తొలగించారు. దీనిపై కొందరు అడ్డుకుని గడువు ఇవ్వమని ప్రాధేయపడినా పట్టించుకోలేదు. అయితే ఓ రెండు దుకాణాలను మాత్రం అలాగే వదిలేశారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి అధికార పార్టీ అండ దండలు ఉన్నాయా? చేయి తడిపితే వదిలేశారా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఓ లాడ్జీ యజమాని తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించారని కోర్టుకు వెళ్తున్నట్లు తెలిసింది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

సత్యవేడు : ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయం ఆధ్వర్యంలో వైద్యులు నందిని, చైతన్య కలసి 201 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 మందికి కంటి అద్దాలు అందజేశారు. 15 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేసేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీఈఓ సీతారామానాయుడు ఏఓ కృష్ణగల్లా, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిమల్లంలో స్వామీజీలు



గుడిమల్లం ఆలయాన్ని సందర్శించిన చిదంబరేశ్వర తిరుమఠం స్వామీజీలు

రేణిగుంట(ఏర్పేడు) : మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం రాత్రి తమిళనాడు తిరుమంగళంకు చెందిన చిదంబరేశ్వర తిరుమఠం స్వామీజీలు అయ్యర్ గణేష్ స్వామి, వెంకటరామన్‌స్వామి అయ్యర్, శివ అగ్ర అయ్యర్, అంబిలి స్వామి దర్శించుకున్నారు. వారికి ఆలయ పెద్దలు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. చోళుల కాలం నాటి అతిపురాతన శైవక్షేత్రమైన గుడిమల్లం ఆలయ శిల్పసౌందర్యాన్ని వారు కొనియాడారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా నిత్యం ఆకాశ దీపం వెలిగించిచడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలో ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు తేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శివనాథపాళెంలో కార్డన్‌సెర్చ్




రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం శివనాథపాలెంలో బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, శ్రీకాళ హస్తి గ్రామీణ సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు సరిగా లేని 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌లో తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు..సమాజ మార్గదర్శకాలు



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: అన్నమయ్య కీర్తనలు ఆధ్యాత్మిక భావాలకు మార్గదర్శకాలే కాకుండా, సమసమాజ స్థాపనకు దోహద పడతాయని, సంస్కృతి, సంప్రదాయ కళలు ఎక్కడ వికాసంతో విరాజిల్లుతాయో అక్కడ సుభిక్షత ఉంటుందని, పలువురు వక్తలు తెలిపారు. జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళాక్షేత్రంలో చేపడుతున్న అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి అన్నమయ్య వంశీయులు హరినారాయణ ఆచార్య, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, రచయిత ధర్మయ్య, రాష్ట్ర రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మునిరత్నం ప్రధాన వక్తలుగా హాజరై ప్రసంగించారు. తిరుమల శ్రీవారి అపరభక్తుడైన అన్నమయ్య సంకీర్తనలపై సంగీతం, నృత్యోత్సవాలు చేపట్టి తద్వారా అన్నమయ్య కీర్తిని ఇనుమిడింపజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంగీత, నృత్య కళావికాసానికి నిరంతరం కృషి చేస్తున్న గురువులను, అలాగే అన్నమయ్య వంశీయుడు తాళ్లపాక హరినారాయణాచార్యులను ఘనంగా సత్కరించారు. సుమారు 400 మందికి పైగా కళాకారులు పాల్గొని అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం, నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కేవీ.రమణరావు, కళాకారులు, గురువులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం కందాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశం అయ్యారు. అప్పటి హెచ్‌ఎం ఎల్లంటి రామచంద్రనాయుడు, ఉపాధ్యాయులు రాంప్రసాద్, మోహన్‌బాబు, శైలజ, వి.భారతి, వి.గాయత్రి హాజరయ్యారు. గురువులు తమకు నేర్పిన విద్యాబుద్ధులు ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదం చేశాయని పూర్వ విద్యార్థులు మాట్లాడారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామన్నారు. హైస్కూల్‌లో చదివిన నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు.



కందాడ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

తిరుపతి సిటీ: మానసిక ఉల్లాసం, ఒత్తిడిని జయించడంలో క్రీడలు ప్రధాన భూమిక పోషిస్తాయని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్వీయూ స్టేడియం వేదికగా జరిగిన గ్రామోత్సవ క్రీడలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామోత్సవ క్రీడలను నిర్వహించడం ద్వారా మానసిక ఉల్లాసంతో ఒత్తిడి నుంచి ప్రజలు బయటపడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇషా ఫౌండేషన్ వారు గ్రామోత్సవం పేరిట ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇషా ఫౌండేషన్ తిరుపతి ప్రాంత కన్వీనర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామోత్సవ క్రీడా కార్యక్రమాలతో గ్రామాల్లో నూతన ఉత్సాహం తీసుకురావడమే తమ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సీఐ రామయ్య, తిరుపతి పరిసర ప్రాంతాల గ్రామీణ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాల వితరణ

తిరుపతి అర్బన్: తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రేడ్-1 గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఆదివారం చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు నాయుడు గ్రూప్-2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందజేశారు. ఈ మేరకు పుస్తకాలను నిరుద్యోగుల కోసం గ్రంథాలయంలో సోమవారం నుంచి అందుబాటులో ఉంచుతామని గ్రంథాలయాధికారి శివప్రసాద్ వెల్లడించారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుపతికి చెందిన త్రినేత్ర డ్యాన్స్ అకాడమీ, శ్రీనటరాజ డ్యాన్స్ అకాడమీ, నృత్య ప్రియ డ్యాన్స్ అకాడమీ, కల్యాణి డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా గణేష కౌత్యం, గణనాయక, నాట్య గణపతి, భో శంభో, చంద్ర చూడశివ శంకర వంటి పాటలకు కళాకారులు లలిత, లక్ష్మీ చరిత, చార్వి, దీపిక, పావని, సాత్విక, తన్మయి, ఎలన్ రాజ్, జయంత్, రూపశ్రీ అద్భుత ప్రదర్శన ఇచ్చారు. పాటకు తగిన హావభావాలు, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీతో పాటు నిర్వాహకులు సత్కరించి, బహుమతులను ప్రదానం చేశారు.

తూనికలు, కొలతల్లో తేడాలుంటే కేసులు



బుచ్చినాయుడుకండ్రిగ : దుకాణాల్లో తూనికలు, కొలతల్లో తేడాలుంటే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడు కండ్రిగలోని దుకాణాల్లోని తూనికలు, కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూనికలు, కొలతలల్లో దుకాణ యజమానులు మోసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఏటా తూనికలకు ముద్రలు వేయించుకోవాలని, లేకుంటే జరిమానా తప్పదన్నారు. ఇందులోభాగంగా పలు దుకాణ యజమానులకు జరిమానా విధించారు.

తూనికలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి



కేవీబీపురంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ కేవీబీపురం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్లను కేవీబీపురం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలిసారి సత్యవేడులో జరుగుతున్న మహాసభలకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకరయ్య, కన్యమ్మ, దేశమ్మ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ప్లేట్ల వితరణ

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో జరిగే నిత్య అన్నదానానికి దాతలు ఆదివారం స్టీల్ ప్లేట్లు వితరణగా అందించారు. చిత్తూరుకు చెందిన శివషణ్ముగ సుందర వినాయక స్వామి ఆలయ చైర్మన్ కన్నన్ 51 ప్లేట్లను అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి వారికి ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాటు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గుడిమల్లం ఆలయానికి ప్లేట్లు అందిస్తున్న కన్నన్

రేకుల షెడ్డు కూల్చివేత : కేసు నమోదు



రేకుల షెడ్‌ను కూల్చి చదును చేసిన స్థలం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని చల్లమాంబపురంలో రేకుల షెడ్డు కూల్చివేతపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. చల్లమాంబపురంలో శ్రీకాళహస్తి, తడ రహదారి ఆనుకుని ఉన్న మున్నెమ్మకు చెందిన స్థలంలో అదే గ్రామానికి చెందిన మునెయ్య భార్య శాంతి రేకుల షెడ్ వేసుకుని వ్యాపారం చేసుకుంటోంది. ఆదివారం స్థలం యజమాని మునెమ్మ, ఆమె మరిది రమేష్ రేకుల షెడ్డును జేసీబీ యంత్రంతో కూల్చివేశారు. దీనిపై శాంతి ఫిర్యాదు చేయడంతో జేసీబీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

29న లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ఈనెల 29వ తేదీన ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూలమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కబళిస్తున్న కల్వర్టు



పెద్ద పాండూరు మార్గంలో రక్షణ గోడలేని కల్వర్టు

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరు– వరదయ్యపాళెంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో పాండూరు చెరువు వద్ద కలుజు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టుపై పిట్టగోడ నిర్మించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పెద్ద పాండూరు చెరువు నుంచి పొలాలకు సాగునీరు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో గతంలో పైపు కల్వర్టు నిర్మించారు. కానీ కల్వర్టుకు ఇరువైపులా పిట్టగోడ నిర్మించడం విస్మరించారు. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు కల్వర్టు మలుపు వద్ద తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు కల్వర్టు వద్ద కాలువను గమనించక నేరుగా కాలువలోకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాల బారినపడుతున్నారు. ఇదే కల్వర్టు వద్ద ఏడాదిన్నర కిందట కొయ్యల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ సంబంధిత కల్వర్టు వద్ద అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనదారులు అనేకసార్లు ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా పిట్టగోడను నిర్మించాలని కోరుతున్నారు.